సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
బుధవారం ǀ 30 ǀ అక్టోబర్ ǀ 2024



ఆకట్టుకున్న ఓపెన్ హౌస్

పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఓపెన్ హౌస్ నిర్వహించారు. పోలీసులు వాడే సామగ్రిని చిన్నారులు ఆసక్తిగా తిలకించారు. 8లో



కిలో టమాట రూ.28

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.28, కనిష్టంగా రూ.13, సరాసరిన రూ.20 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
34.8°/19.4°

జిల్లాలో మంగళవారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

నవోదయలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు



చెస్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులు

లేపాక్షి: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో మంగళవారం ఉదయం రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తొలి రోజు గ్రూపు కాంపిటీషన్ విభాగంలో చెస్ పోటీలు నిర్వహించగా, విద్యార్థులు పోటాపోటీగా తలపడ్డారు. ఎత్తుకుపై ఎత్తు వేస్తూ ప్రత్యర్థులను ముప్పుతిప్పలు పెట్టారు. అంతకుముందు లేపాక్షి నవోదయ పాఠశాల ప్రిన్సిపాల్ నాగరాజు, ప్రధానోపాధ్యాయుడు వివి.గిరి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓలు నాగరాజు, కుళ్లాయప్ప, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యాదర్శి మొరార్జి యాదవ్, ఆర్గనైజర్ సురేష్, పరిశీలకులు ఉమేష్‌కుమార్, ఉదయ్ కుమార్, శివ, ఆది రత్నకుమార్‌తో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిలకడగా ఎండుమిర్చి ధరలు



మార్కెట్‌కు రైతులు తీసుకు వచ్చిన ఎండు మిర్చి

హిందూపురం అర్బన్: ఎండుమిర్చి ధరలు నిలకడగా కొనసాగుతున్నాయి. మంగళవారం హిందూపురం మార్కెట్‌కు 290 మంది రైతులు 239 క్వింటాళ్ల ఎండు మిర్చి తీసుకువచ్చారు. మొదటి రకం సరుకు క్వింటా రూ.16 వేలు, రెండో రకం క్వింటా రూ.9 వేలు, మూడో రకం క్వింటా రూ.7 వేలు పలికినట్లు మార్కెట్ కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు. మార్కెట్‌కు నాణ్యమైన ఎండు మిర్చి తీసుకురావాలని, అప్పుడే మంచి ధర లభిస్తుందని ఆయన రైతులకు సూచించారు.

కదిరి మున్సిపాలిటీకి రాష్ట్ర స్థాయి అవార్డు



మంత్రి నారాయణ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కదిరి మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్

కదిరి: కేంద్ర ప్రభుత్వ పీఎం స్వనిధి (ప్రధానమంత్రి స్ట్రీట్ వెండర్స్ ఆత్మ నిర్భర్ నిధి) పథకాన్ని 2023–24 సంవత్సరంలో సమర్థవంతంగా అమలు చేసిన కదిరి మున్సిపాలిటీకి రాష్ట్ర స్థాయి అవార్డు దక్కింది. పీఎం స్వనిధి ద్వారా పేదలకు ఆర్థిక సాయం అందించి వారి అభ్యున్నతికి కృషి చేయడంతో కదిరి మున్సిపాలిటీకి ఈ అవార్డు అందజేశారు. విజయవాడ తుమ్మలపల్లి కళా క్షేత్రంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో మంత్రి నారాయణ చేతుల మీదుగా కదిరి మున్సిపల్ కమిషనర్ కె.కిరణ్‌కుమార్ అవార్డును అందుకున్నారు. 'పీఎం స్వనిధి' పథకం ద్వారా చిరు వ్యాపారులకు తొలుత రూ.10 వేల చొప్పున రుణం ఇస్తారు. సకాలంలో రుణం చెల్లించిన వారికి 7 శాతం వడ్డీని కేంద్రం మాఫీ చేస్తుంది. అలాగే వారికి తిరిగి రూ. 50 వేల దాకా రుణం అందజేస్తారు. ఈ పథకం ద్వారా రుణాలు ఇవ్వడంతో పాటు రికవరీలో కూడా కదిరి మున్సిపాలిటీలోని మెప్మా అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా పనిచేయడంతో ఈ అవార్డు దక్కిందని మున్సిపల్ కమిషనర్ ఈ సందర్భంగా తెలిపారు.


పల్లె పల్లెనా కిక్కు!

అంతర్జాతీయ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తికి సుమారు 8 కిలోమీటర్ల దూరంలో మద్యం, మాంసం దుకాణాలు ఏర్పాటు చేయకూడదు. విక్రయాలు చేపట్ట కూడదు. పుట్టపర్తి పేరు చెబితే సత్యసాయిబాబానే గుర్తుకురావాలి. ఆధ్యాత్మిక వెలుగులే కళ్లముందు కనిపించాలి.

» గత పాలకులు తీసుకున్న నిర్ణయాలివి. ఈ మేరకు గెజిట్ కూడా విడుదల చేశారు. అందుకే ప్రశాంతి నిలయం అంతర్జాతీయంగా ఆధ్యాత్మిక వెలుగులు విరజిమ్ముతోంది.

పుట్టపర్తి పట్టణం నడిబొడ్డున ఉన్న సత్యమ్మ ఆలయం సర్కిల్‌లోనే మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. వివిధ వార్డుల్లో బెల్టుషాపులు ఏర్పాటు చేశారు. దీంతో మందుబాబులు పగలు, రాత్రి తేడా లేకుండా తాగి తూలుతూ వీధుల్లో సంచరిస్తున్నారు. పుట్టపర్తికి వచ్చే విదేశీయులు భయపడిపోతున్నారు. కనీసం ప్రశాంతి నిలయం ప్రాముఖ్యతనైనా గుర్తించండి. ధన దాహంతో ఆధ్యాత్మిక కేంద్రం ప్రతిష్టను పాడుచేయకండి.

» కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక పట్టణంలో వెలసిన దుకాణాలు, బెల్టుషాపులపై సత్యసాయి భక్తుడి ఆవేదన ఇది.



ఊరూరా సాగుతున్న 'బెల్టు' దందా

- దుకాణాలన్నీ కూటమి నేతల కనుసన్నల్లోనే..
- సిండికేటుగా మారి మద్యం రేట్లు పెంచిన వైనం
- ఎమ్మార్పీపై క్వార్టర్‌కు రూ.50 అదనం
- మద్యం దుకాణానికి పది 'బెల్టు' షాపులు!
- ఇళ్ల మధ్యలో విచ్చల విడిగా మద్యం విక్రయాలు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న మహిళలు, చిన్నారులు

సాక్షి, పుట్టపర్తి/పుట్టపర్తి అర్బన్: జిల్లాలో మద్యం ఏరులై పారుతోంది. పేరుకు జిల్లా వ్యాప్తంగా 87 దుకాణాలేనని ప్రభుత్వం చెబుతున్నా... పల్లెపల్లెనా 'బెల్టు' షాపులు తెరుచుకున్నాయి. అందువల్లే ఏ గ్రామంలో చూసినా విచ్చలవిడిగా మద్యం దొరుకుతోంది. ఏ సమయంలో అడిగినా డోర్ డెలివరీ చేస్తున్నారు. ఫోన్ పే చేస్తే చాలు.. క్వార్టర్ కళ్లముందు ప్రత్యక్షమవుతోంది. దీంతో పల్లెలన్నీ మద్యం మత్తులో తూలుతున్నాయి.



పుట్టపర్తి రైల్వే స్టేషన్ సమీపంలో ఓ చిల్లర కొట్టు వద్ద మద్యం సేవిస్తున్న దృశ్యం

సిండికేటు.. అధిక రేటు

జిల్లా వ్యాప్తంగా 8 ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 87 ప్రైవేటు మద్యం దుకాణాలు వెలిశాయి. ఇందులో 80 దుకాణాలు కూటమి నేతల ఆధ్వర్యంలో ఉన్నాయి. ఆయా దుకాణాల పరిధిలో టీడీపీ నేతలు వ్యాపారం పేరుతో అక్రమార్జనే ధ్యేయంగా సిండికేటుగా మారారు. లిక్కర్‌పై ఇష్టానుసారం వసూలు చేస్తున్నారు. మద్యం దుకాణాల వద్ద కూడా రాత్రి 7 గంటలు దాటితే క్వార్టరుపై రూ.30 నుంచి రూ.50 వరకూ అదనంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇలాంటి ఘటనలు జిల్లా కేంద్రం పక్కనే ఉన్న కొత్తచెరువులో వెలుగు చూశాయి. ఇదే విషయమై ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు హెచ్చరించినట్లు తెలిసింది.

జోరుగా బెల్టు షాపుల ఏర్పాటు

జిలాల్లో 87 మద్యం దుకాణాలకు ప్రభుత్వం లైసెన్స్ ఇవ్వగా.. ప్రతి మద్యం షాపు పరిధిలో 8 నుంచి 10 వరకు బెల్టు షాపులు వెలిసినట్లు తెలుస్తోంది. ఈ లెక్కన జిల్లా వ్యాప్తంగా సుమారు 800 వరకు బెల్టు షాపులు ఏర్పాటయ్యే అవకాశం ఉండగా.. ఇప్పటికే 500పైగా బెల్టుషాపులు నడుస్తున్నట్లు సమాచారం. ప్రతి మద్యం దుకాణం పరిధిలోని గ్రామాల్లో పంపిణీకి నిర్వాహకులు బ్లాక్‌లో టెండర్లు పిలిచినట్లు తెలిసింది. ఏడాదికి రూ.లక్ష మామూలు ఇచ్చి ప్రతి రోజూ మద్యం తీసుకెళ్లి...మీకిష్టమైన ధరకు అమ్ముకోవచ్చని ఆశ చూపుతున్నారు. ఇలాంటి వ్యవహారం ప్రతి మద్యం దుకాణం పరిధిలో వెలుగు చూస్తోంది. అలాగే తమకు అనుకూలంగా ఉన్న చిల్లర దుకాణాలకు సైతం మద్యం సరఫరా చేసేందుకు మద్యం దుకాణాల నిర్వాహకులు సిద్ధమయ్యారు. దీంతో కిరాణా దుకాణాల్లోనూ మద్యం లభిస్తుండగా.. మద్యం విక్రయాలకు వేళాపాళా లేకుండా పోతోంది.

బెల్టు మాటున కర్ణాటక మద్యం

ఇక బెల్టు షాపుల మాటున కర్ణాటక మద్యం విక్రయాలు కూడా సాగుతున్నట్లు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం అన్ని బ్రాండ్లు అందుబాటులోకి తేకపోవడంతో అలవాటు పడిన కర్ణాటక మద్యానికే మందుబాబులు మొగ్గు చూపుతున్నారు. డిమాండ్‌కు అనుగుణంగా సరిహద్దు ప్రాంతాల్లో కర్ణాటక మద్యం విక్రయాలు ఇష్టారాజ్యంగా సాగుతున్నాయి. జిల్లాలోని తనకల్లు, పెనుకొండ, హిందూపురం, మడకశిర, సీకే పల్లి ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలోని దుకాణాలన్నీ దాదాపు కర్ణాటక సరిహద్దులో ఉన్నాయి. దీంతో రాత్రికి రాత్రే అడ్డదారుల్లో కర్ణాటక మద్యం దిగుమతి అవుతోంది.

అనుమతులు లేకున్నా..

బహిరంగ మద్యపానానికి అనుమతి లేదు. బెల్టు షాపులకు పర్మిట్ ఇవ్వలేదు. మద్యం దుకాణం పక్కన తాగరాదని నిబంధనలు ఉన్నాయి. కానీ గుడి, బడి అని తేడా లేకుండా వాటి సమీపంలోనే బెల్టు షాపులు వెలిశాయి. ఎక్కడ పడితే అక్కడే మందుబాబులు మకాం పెట్టేస్తున్నారు. ఫలితంగా జనావాసాల మధ్యలో చిల్లర దుకాణాల వద్ద పూటుగా మద్యం సేవిస్తున్నారు. పోలీసులు కూడా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండటంతో మందుబాబులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ జనసామాన్యులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు.

- గోరంట్ల మండలంలోని కరావులపల్లిలో నాలుగు బెల్ట్ షాపులకు అనధికార అనుమతులు ఇవ్వడంతో... జనావాసాల మధ్యలోనే షాపులు ఏర్పాటు చేశారు. దీంతో మద్యం బాబులు నిత్యం తాగి తూలుతున్నారని మహిళలు వాపోతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో బెల్ట్ షాపులు ఏర్పాటు చేసిన ఇళ్ల ముందు క్యూ కడుతున్నారని, అటువైపు వెళ్లాలంటేనే ఇబ్బందులు పడుతున్నామని మహిళలు వాపోతున్నారు.

బెల్టు షాపుల ఆట కట్టిస్తాం

లాటరీలో దక్కించుకున్న దుకాణాల్లో మాత్రమే మద్యం విక్రయాలు జరగాలి. బెల్టు షాపులకు అవకాశం లేదు. ఎక్కడైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. జనావాసాల మధ్య మద్యం అమ్మకాలు నిర్వహిస్తే ప్రజలు సమాచారం ఇవ్వాలి. తప్పక చర్యలు తీసుకుంటాం. అధిక ధరలకు మద్యం విక్రయించిన వారిపై ప్రత్యేక నిఘా ఉంచాం. ఎవరినీ వదిలే ప్రసక్తే లేదు. అక్రమార్కుల ఆట కట్టిస్తాం.

– గోవిందనాయక్, ఎక్సైజ్ సూపరింటెండెంట్

అతివలే అధికం!



- ఓటరు ముసాయిదా జాబితా విడుదల చేసిన కలెక్టర్
- 14 లక్షలు దాటిన జిల్లా ఓటర్లు
- పురుషులతో పోలిస్తే 8,288 మంది మహిళలు అధికం
- జనవరి 6న ఓటరు తుది జాబితా

జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో ఓటర్ల వివరాలు ఇలా...

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం ఓటర్లు
మడకశిర(ఎస్సీ)	1,05,783	1,05,076	1	2,10,860
హిందూపురం	1,25,140	1,24,977	18	2,50,135
పెనుకొండ	1,18,054	1,18,195	4	2,36,253
పుట్టపర్తి	1,04,368	1,07,073	12	2,11,453
ధర్మవరం	1,21,897	1,24,106	20	2,46,023
కదిరి	1,24,967	1,29,070	8	2,54,045

14,08,769 జిల్లాలో మొత్తం ఓటర్లు

7,00,209 పురుష ఓటర్లు

7,08,497 మహిళా ఓటర్లు

ట్రాన్స్ జెండర్ ఓటర్లు **63**

8,288 పురుషుల కంటే అధికంగా ఉన్న మహిళా ఓటర్లు

ప్రశాంతి నిలయం: ఆకాశంలో సగం..అన్నింటా సగం అంటూ ఇన్నాళ్లు ఆడవాళ్ల గురించి ప్రస్తావిస్తూ ఉంటాం. కానీ ఇప్పుడు అతివలే అన్నింటా ముందుంటున్నారు. జిల్లా ఓటరు జాబితాలోనూ పురుషుల కంటే మహిళలే ఎక్కువగా ఉన్నారు. ముసాయిదా ఓటరు జాబితాను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ టీఎస్ చేతన్ మంగళవారం విడుదల చేశారు. జిల్లా ఎన్నికల యంత్రాంగం లెక్కల ప్రకారం జిల్లాలో 14,08,769 మంది ఓటర్లుగా ఉండగా, అందులో పురుషులు ఓటర్లు 7,00,209 మంది ఉండగా, మహిళా ఓటర్లు 7,08,497 మంది ఉన్నారు. మరో 63 మంది ఇతరులు ఓటర్లుగా ఉన్నారు. మొత్తంగా పురుషులతో పోలిస్తే మహిళా ఓటర్లు 8,288 మంది ఎక్కువగా ఉన్నారు. ఇక సర్వీస్ ఓటర్లు మరో 1,313 మంది ఉన్నారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం ముసాయిదా ఓటరు జాబితా ప్రకటించిన వెంటనే కొత్తగా ఓటరు నమోదు, ఓటు తొలగింపు, ఓటు వివరాల మార్పు ప్రక్రియ ప్రారంభమయ్యింది. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పూర్తయిన తర్వాత 2025, జనవరి 6వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తారు.

ఇంటింటి సర్వే

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు జిల్లా ఎన్నికల విభాగం ఆగస్టు 20వ తేదీ నుంచి అక్టోబర్ 18వ తేదీ వరకూ ఇంటింటి సర్వే చేపట్టింది. 1,500పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను విభజిస్తూ నూతన పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేలా ప్రతిపాదనలు చేశారు. క్షేత్ర స్థాయిలో బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి వారి దృష్టికి వచ్చిన క్లెయిమ్‌లు పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలు ఓటర్లుకు రెండు కిలోమీటర్లకు మించి దూరంగా లేకుండా ఏర్పాటు చేసేలా ప్రతిపాదించారు. మృతుల ఓట్లను జాబితా నుంచి తొలగించడంతో, ఒక ప్రదేశం నుంచి ఇంకో ప్రదేశానికి మైగ్రేట్ అయిన ఓటర్ల వివరాలు సేకరించి ముసాయిదా జాబితా రూపొందించారు.

మూడు నియోజకవర్గాల్లో మహిళల హవా

జిల్లా యంత్రాంగం విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితా పరిశీలిస్తే పెనుకొండ, పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాలలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. పెనుకొండ నియోజకవర్గంలో 141 మంది, పుట్టపర్తి నియోజకవర్గంలో 2,705 మంది, కదిరి నియోజకవర్గంలో 4,103 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు.

అన్నదాతకు తీరని అన్యాయం

- కరువు జాబితాలో ఉమ్మడి జిల్లాలో కేవలం 17 మండలాలే
- 46 మండలాల రైతులకు మొండిచేయి
- చంద్రబాబు సర్కారు తీరుపై ఆగ్రహావేశాలు

అనంతపురం అగ్రికల్చర్: సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కారు అన్నదాతను అడుగడుగునా దారుణంగా వంచనకు గురిచేస్తోంది. 'వ్యవసాయం దండగమారి' అంటూ గతంలో చంద్రబాబు రైతులను చిన్నచూపు చూశారు. మొన్నటి ఎన్నికల్లో అలవిగాని హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు సర్కారు తన పంథాను మార్చుకోవడం లేదు. ఇప్పటికే గతేడాదికి సంబంధించి ఉచిత పంటల బీమా కింద రావాల్సిన పరిహారాన్ని మరిపించేశారు. ఏడాదికి రైతుకు రూ.20 వేల పెట్టుబడి సాయం అంటూ ఊరించి చేయిచ్చారు. నేడు మరోసారి కరువు మండలాల ప్రకటనతో రైతులను పక్కా మోసం చేశారు. రైతులకు తీరని అన్యాయం జరిగేలా ఖరీఫ్–2024 కరువు మండలాలను మంగళవారం ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా కేవలం 54 మండలాలను కరువు జాబితాలో ప్రకటించి చేతులు దులిపేసుకున్నారు. అందులో గతేడాదితో పాటు ఈఏడాది కరువు బారిన పడి తీవ్ర కష్టాలు పడుతున్న ఉమ్మడి జిల్లా రైతులను దారుణంగా మోసం చేశారు.

కేవలం 17 మండలాలే..

అధిక వర్షాలు నమోదైన విషయాన్ని సాకుగా చూపి ఉమ్మడి జిల్లాలో 17 మండలాలను మాత్రమే కరువు జాబితాలో చేర్చారు. మిగతా 46 మండలాలకు మొండి చేయి చూపించారు. అనంతపురం జిల్లాలో ఏడు మండలాలు ప్రకటించగా.. అనంతపురం, నార్పల మండలాలను మాత్రమే తీవ్రత (సివియర్) ఉన్నట్లు గుర్తించారు. విడపనకల్లు, యాడికి, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, రాప్తాడు మండలాలను మాదిరి కరువు (మోడరేట్) మండలాల జాబితా కింద చేర్చారు. శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలో 10 మండలాలను ప్రకటించగా తాడిమర్రి, ముదిగుబ్బ, తలుపుల మండలాలను కరువు తీవ్రత కింద ప్రకటించారు. కనగానపల్లి, ధర్మవరం, ఎన్పీ కుంట, గాండ్లపెంట, బుక్కపట్నం, రామగిరి, పరిగి మండలాలను మాదిరి కరువు మండలాలుగా గుర్తించారు. మిగతా మండలాల రైతులకు తీవ్ర అన్యాయం జరిగేలా చంద్రబాబు సర్కారు వ్యవహరించడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. పెట్టుబడి సాయం (ఇన్‌పుట్‌సబ్సిడీ) నామమాత్రంగా విడుదల చేసే అవకాశం ఉందని చెబుతున్నారు.

షూటింగ్ బాల్ జట్ల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

పుట్టపర్తి: రాష్ట్ర స్థాయిపోటీల్లో ప్రాతినిధ్యం వహించే జిల్లా సబ్ జూనియర్ షూటింగ్ బాల్ జట్ల ఎంపిక ప్రక్రియ మంగళవారం బుక్కపట్నంలోని బాలుర హైస్కూల్ మైదానంలో చేపట్టారు. ఎంపికైన వారు వచ్చే నెల అనంతపురం జిల్లా నార్పలలో జరిగే 43వ రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతిథ్యం వహించనున్నట్లు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ మనోహర్‌రెడ్డి, హెచ్‌ఎం జగదీశ్వర్, పీడీ నాగరాజు తెలిపారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఆర్జేడీ శామ్యూల్



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్జేడీ శామ్యూల్

పుట్టపర్తి: కొత్తచెరువు గ్రామంలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆర్జేడీ శామ్యూల్ మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. విద్యార్థినుల హాజరు శాతం, ఆపార్ జనరేషన్, సీసీఈ మార్కుల నమోదు ప్రక్రియపై ఆరా తీశారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఓ కిష్టప్ప, ఎంఈఓ–2 జయచంద్ర, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

2 నుంచి హనుమద్ దీక్షలు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: వచ్చే నెల 2వ తేదీ నుంచి హనుమద్ మండల దీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో దీక్షకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో ఆలయ ఈఓ కె.వాణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఆంజనేయస్వామి భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఆచరించే మండల దీక్షలు నవంబర్ 2వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయన్నారు. నవంబర్ 22వ తేదీన అర్ధమండల దీక్షలు ప్రారంభమవుతాయన్నారు. మండల, అర్ధమండల దీక్షలు చేపట్టే భక్తులు ఆయా తేదీల్లో ఆలయంలో మాలను ధరించవచ్చునని పేర్కొన్నారు. మండల దీక్షలు ముగిసిన అనంతరం డిసెంబర్ 12న ఇరుముడి సమర్పణలో భాగంగా తిరు ఉత్సవం కార్యక్రమం ఉంటుందన్నారు. డిసెంబర్ 13న హనుమద్ వ్రతంతో మండల దీక్షలు ముగుస్తాయన్నారు.

మొక్కజొన్న తోటలో మైకుల మోత


మొక్కజొన్న పంటలో ఏర్పాటు చేసిన మైకు

రొద్దం: మండల వ్యాప్తంగా రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంటలో రేయింబవళ్లు మైకుల మోత మోగుతోంది. చేతికి వచ్చిన పంటను రాత్రి అడవి పందులు, పగలు కోతులు, నెమళ్లు, పశువుల బెడద నుంచి కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. ఈ క్రమంలో కొందరు తమ పొలాల్లో మైకులు ఏర్పాటు చేసి జంతువులు, పక్షులను బెదరగొడుతున్నారు. ఈ ప్రయోగం ఆశించిన మేర సత్ఫలితాలను ఇవ్వడంతో మిగిలిన రైతులూ ఇదే బాట పట్టారు.

డిసెంబర్ ఆఖరుకల్లా బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు

అనంతపురం సిటీ: డిసెంబర్ నెలాఖరుకల్లా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు అందుబాటులోకి రానున్నట్లు ఆ శాఖ జనరల్ మేనేజర్ షేక్ ముజీబ్ పాషా తెలిపారు. అనంతపురంలోని జిల్లా కార్యాలయంలోని తన చాంబర్‌లో సోమవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 324 బీఎస్ఎన్ఎల్ టవర్లు ఉన్నాయన్నారు. ఇప్పటి వరకూ ఇతర ఏ నెట్‌వర్క్ సౌకర్యం లేని 15 గ్రామాల్లో కొత్తగా 4జీ సేవలతో బీఎస్ఎన్ఎల్ టవర్లు నిర్మించినట్లు వివరించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 122 టవర్లను 4జీగా మార్పు చేసినట్లు తెలిపారు. అక్టోబర్ నెలాఖరుకల్లా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4జీ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించగా, సాంకేతిక కారణాలతో ఆలస్యమవుతోందన్నారు. డిసెంబర్ నెలాఖరు నాటికి ఉమ్మడి జిల్లా అంతటా 4జీ, 5జీ సేవలు కూడా అందేలా యుద్ధప్రాతిపదికన పనులు చేస్తున్నట్లు వెల్లడించారు.

పస్తుల చదువులు!


క్యారియర్లు తెచ్చుకుని భోజనం చేస్తున్న హిందూపురం బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు


క్యారియర్లలో తెచ్చుకున్న భోజనం చేస్తున్న లేపాక్షి జూనియర్ కళాశాల విద్యార్థినులు

- హామీలకే పరిమితమైన ఇంటర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం
- అధికారం చేపట్టి ఐదు నెలలైనా ఊసెత్తని కూటమి ప్రభుత్వం

హిందూపురం టౌన్: 'అధికారంలోకి వస్తే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తాం' అంటూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అధికారం చేపట్టిన తర్వాత కూటమి పెద్దలు విస్మరించారు. 2024–25 విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే ఇంటర్ విద్యార్థులకు కళాశాలల్లో భోజనం అందిస్తామని యువగళం పాదయాత్రలో నారా లోకేష్ స్పష్టమైన హామీని ఇచ్చి... విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తుంగలో తొక్కారు. దీంతో ఇంటి నుంచి క్యారియర్ల మోత తప్పడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామీణ విద్యార్థుల అవస్థలు

జిల్లా వ్యాప్తంగా 22 ప్రభుత్వ జూనియర్ బాలికల, బాలుర కళాశాలలు ఉన్నాయి. వీటిల్లో 7,050 మంది విద్యార్థులు మొదటి, ద్వితీయ సంవత్సరంలో విద్యనభ్యసిస్తున్నారు. వీరిలో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే వారి సంఖ్య అధికంగా ఉంది. ఉదయం కళాశాలకు వచ్చే హడావుడిలో పలువురు విద్యార్థులు క్యారియర్లు తీసుకురాలేకపోతున్నారు. దీంతో మధ్యాహ్న సమయంలో వారు పస్తులతోనే ఉండాల్సి వస్తోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుండడంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు.

మోసాలకు పరాకాష్ట



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఈ విద్యాసంవత్సరం నుంచి మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తామని ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎన్నికల సమయంలో హామీనిచ్చారు. అధికారం చేపట్టి ఐదు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు ఊసే లేదు. కూటమి ప్రభుత్వ మోసాలకు ఇది పరాకాష్ట. ఇప్పటికైనా జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించాలి.

– చంద్రశేఖర్‌రెడ్డి, ఏఐఎస్ఎఫ్, జిల్లా ప్రధాన కార్యదర్శి

వెంటనే అమలు చేయాలి



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం వెంటనే అమలు చేయాలి. ఈ పథకం అమలు చేస్తే పేద విద్యార్థుల చదువులు ఎలాంటి ఆటంకం లేకుండా కొనసాగుతాయి. ఎంతో మంది విద్యార్థులు మధ్యాహ్నం పస్తులతోనే ఉంటున్నారు. – వసంత్, సీనియర్ ఇంటర్ విద్యార్థి

క్యారియర్లు తెచ్చుకోలేకున్నాం



ఉదయం ఆలస్యమై క్యారియర్లు తీసుకురాలేని పరిస్థితులు చాలా ఉన్నాయి. దీంతో మధ్యాహ్నం తిరిగి ఇళ్లకు వెళ్లి భోజనం చేసి రాలేక పస్తులతో ఉంటున్నాం. మా ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించి కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం వెంటనే అమలు చేయాలి.

– నితిన్, ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థి, లేపాక్షి

పండుగ పూట... అక్రమాల మూట


ధర్మవరం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఏర్పాటైన టపాసుల విక్రయ దుకాణాలు

- టపాసుల విక్రయాల్లో నిబంధనలకు పాతర
- ఏడుగురికి అనుమతులు.. 62 దుకాణాలు
- ఇరుకు దుకాణాల ఏర్పాటుతో ప్రజల ప్రాణాలకు పొంచి ఉన్న ముప్పు

తెలంగాణలోని హైదరాబాద్ అబిడ్స్‌లో టపాసుల దుకాణంలో జరిగిన ప్రమాదం చూసిన తర్వాత కూడా జిల్లాలో టపాసుల విక్రయ కేంద్రాల్లో నిబంధనలు పాటించకుండా అధికారులు చోద్యం చూస్తున్నారు. దీపావళి సందర్భంగా టపాసుల విక్రయ లైసెన్సులు దక్కించుకున్న కూటమి పార్టీల నేతలు ఇష్టారాజ్యంగా దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. అనుమతికి మించి దుకాణాలను... అదీ ఇరుకుగా ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడేందుకు సిద్ధమయ్యారు.

ధర్మవరం: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో టపాసులు విక్రయాలకు అధికారులు అనుమతి ఇచ్చారు. చాలామంది నుంచి దరఖాస్తులు వచ్చినా అందులో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు సిఫార్సు చేసిన ఏడుగురికి మాత్రమే విక్రయ అనుమతులు ఇచ్చారు. వీరు మాత్రమే ఫైర్ అండ్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తూ జీఎస్టీ చెల్లించి దుకాణాలు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంది. అయితే ఇక్కడ ఏకంగా 62 దుకాణాలను అదీ దుకాణానికి దుకాణానికి మధ్య కనీస దూరం లేకుండా ఆనుకుని ఏర్పాటు చేశారు. అధికారికంగా ఏర్పడిన ఏడు దుకాణాలు మినహా అనధికారికంగా ఏర్పాటైన షాపుల నుంచి ప్రభుత్వానికి జీఎస్టీ వెళ్లదు. తద్వారా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడనుంది. ఇందులో టీడీపీ వారు 32, బీజేపీ వారు 18, జనసేన వారు 12 షాపుల చొప్పున టపాసులు విక్రయించుకునేలా ప్లాన్ వేసినట్లు సమాచారం. వీరంతా అధిక ధరలకు టపాసులు విక్రయించి సొమ్ము చేసుకునేలా సిండికేట్ అయినట్లు తెలుస్తోంది. దీంతో వినియోగదారుల జేబులకు చిల్లు పడనుంది.


దుకాణాల మధ్య గ్యాప్ లేకుండా ఏర్పాటు చేసిన దృశ్యం

ప్రమాదాలకు అవకాశం!

టపాసులు విక్రయించే షాపులు ఇరుకుగా ఉండడం వల్ల ప్రమాదం జరిగే అవకాశమూ లేకపోలేదు. క్రీడా మైదానంలోని షాపుల వద్ద భారీగా జనసందోహం ఉంటుంది. ఈ సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే ప్రజలంతా ఒకేసారి తప్పించుకునే అవకాశం ఉండదు. దుకాణానికి దుకాణానికి మధ్య గ్యాప్ పెంచి దారి వదిలి ఫైర్ అండ్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తే ప్రమాదం నుంచి రక్షణ పొందే వీలుంటుందని నిపుణులు సూచిస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

గతంలో పట్టణంలోని టపాసుల విక్రయ కేంద్రానికి ఎస్పీతో పాటు రెవెన్యూ అధికారులు పలుమార్లు వెళ్లి నిబంధనల ప్రకారం ఏర్పాట్లు జరుగుతున్నాయా లేదా అని పరిశీలించి చర్యలు చేపట్టేవారు. అయితే ఈసారి టపాసుల విక్రయాలలో కూటమి పార్టీల నాయకుల జోక్యం అధికంగా ఉండటంతో అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. జరగరానిదేదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

• ఆకట్టుకున్న ఓపెన్ హౌస్


ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్పీ రత్న


ఎస్పీకి పూల బొకే ఇస్తున్న పోలీసు జాగిలం


క్లూస్ టీం పరికరాల పనితీరును వివరిస్తున్న కానిస్టేబుళ్లు

పుట్టపర్తి టౌన్: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఓపెన్ హౌస్ ఆకట్టుకుంది. కార్యక్రమాన్ని ఎస్పీ రత్న ప్రారంభించారు. వివిధ ప్రభుత్వ ప్రైవేటు పాఠశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం విద్యార్థులతో కలసి పోలీసు అమర వీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు వినియోగించే వివిధ రకాల ఆయుధాల పనితీరును వివరించారు. నేర పరిశోధన విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసు జాగిలాల ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం వీఐజీల రక్షణలో బాగంగా పోలీసులు ప్రాణత్యాగం చేసే నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అర్ల శ్రీనివాసులు ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, డీఎస్పీ విజయకుమార్, ఎస్బీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, సీఐలు తిమ్మారెడ్డి, రవికుమార్, సునీత, సురేష్, ఆర్ఐలు వలి, మహేష్, ఎస్బీ ఎస్ఐ ప్రదీప్ కుమార్, ఆర్ఎస్ఐలు వీరన్న, వెంకటబీర్లు, ప్రదీప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పరిశోధన ఫలాలు ప్రజలకు అందాలి

- కలెక్టర్ చేతన్


ప్రసంగిస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: ప్రజలకు ఉపయోగపడేలా పరిశోధన ఫలాలు ఉండాలని విద్యార్థులకు కలెక్టర్ చేతన్ పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర 2047 విజన్‌లో భాగంగా గోరంట్ల సమీపంలోని బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ హాజరయ్యారు. బెస్ట్ యూనివర్సిటీ చైర్మన్ భరత్‌లాల్ మీనా, చాన్స్‌లర్ డాక్టర్ రూపా వాసుదేవన్ పాల్గొన్నారు. 'స్వర్ణాంధ్ర 2047 విజన్ కార్యక్రమాల అమలు – విద్యార్థుల పాత్ర' అంశంపై కలెక్టర్ ప్రసంగించారు. రానున్న ఐదేళ్లలో వివిధ రంగాలలో 15 శాతం స్థూల ఉత్పత్తి సాధన లక్ష్యంగా విజన్ డాక్యుమెంట్‌ను సిద్ధం చేయడానికి కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో విద్యాసంస్థలను భాగస్వాములను చేయనున్నట్లు పేర్కొన్నారు.

• ఉబికి వస్తున్న గంగమ్మ


చేతి పంపు నుంచి వస్తున్న నీరు

మడకశిర రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు భూగర్భ జలాలు గణనీయంగా పెరిగాయి. ఫలితంగా మడకశిర మండలం మెళవాయి గ్రామ బీసీ కాలనీలోని చేతి పంపు కొట్టకుండానే నీరు ఉబికి వస్తోంది. కాలనీలో 30 ఏళ్ల క్రితం బోరు వేసి చేతి పంపును అమర్చారు. గతంలో చేతి పంపు కొట్టిన నీరు వచ్చేది కాదు. విస్తారంగా వర్షాలు కురువడంతో సమీపంలోని రంగస్వామి కుంట నిండింది. దీంతో భూగర్భ జలాలు పెరిగి చేతి పంపు కొట్టకుండానే నీరు వాటంతటవే వస్తుండంతో మంగళవారం ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఆటోను ఢీకొన్న సీఐ కారు

- విద్యార్థి దుర్మరణం
- చికిత్స పొందుతూ మరొకరి మృతి
- నలుగురికి గాయాలు


విష్ణువర్దన్ (ఫైల్)

ముదిగుబ్బ: ఆటో, కారు ఢీకొన్న ఘటనలో ఓ విద్యార్థి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం డీపీఓలో వీఆర్‌లో ఉన్న సీఐ హారూన్‌బాషా మంగళవారం మధ్యాహ్నం అనంతపురం నుంచి కారులో కదిరి వైపుగా బయలుదేరారు. ముదిగుబ్బ మండలం నాగారెడ్డిపల్లి బ్రిడ్జి వద్దకు చేరుకోగానే ఎదురుగా వేగంగా వచ్చిన ఆటో ఢీకొంది. ఆటోలో ప్రయాణిస్తున్న నల్లమాడకు చెందిన విద్యార్థి విష్ణువర్దన్ (19) అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఉన్న హారూన్‌బాషాతో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న నాగారెడ్డిపల్లికి చెందిన నరసింహులు, ముదిగుబ్బ మండలం పాముదుర్తి కొట్టాలకు చెందిన రాములు నాయక్, లక్ష్మీబాయి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి రెఫర్ చేశారు. అక్కడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ లక్ష్మీబాయి (52) మృతి చెందారు. ఘటనపై పట్నం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, మృతుడు విష్ణువర్దన్ కదిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం కళాశాలకు హాజరైన విష్ణువర్దన్... మధ్యాహ్నం స్వగ్రామానికి ఆటోలో వెళుతూ ప్రమాదంలో మృతి చెందడంతో నల్లమాడలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వ్యక్తి బలవన్మరణం


విజయ్ (ఫైల్)

అగళి: కుటుంబ కలహాల నేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఇరిగేపల్లి గ్రామానికి చెందిన దొక్కల విజయ్ (33) మద్యానికి బానిసై రోజూ తాగిన మత్తులో భార్యతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో ఈ నెల 26న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. మంగళవారం ఉదయం ఆ గ్రామ సమీపంలోని చెరువు వద్దకు వెళ్లిన స్థానికులు.. సీమజాలి చెట్టుకు వేసుకున్న ఉరికి విగత జీవిగా వేలాడుతున్న విజయ్‌ను గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు.

ఎస్కేయూ బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక


ఎంపికైన క్రీడాకారులతో ఎస్కేయూ రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్‌బాబు

అనంతపురం: బెంగళూరులోని క్రైస్ట్ యూనివర్సిటీ వేదికగా నవంబర్ 1 నుంచి 5వ తేదీ వరకు జరిగే దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయాల బాస్కెట్‌బాల్ టోర్నీలో ప్రాతినిథ్యం వహించే ఎస్కేయూ జట్టును మంగళవారం ఎంపిక చేశారు. ఈ మేరకు వర్సిటీ క్రీడా కార్యదర్శి డాక్టర్ బి.జెస్సీ వెల్లడించారు. ఎంపికైన వారిలో గుర్రం రాజేష్, కె.మహమ్మద్ ఉమర్, కె.హెచ్.సాయి సంజన్ (ఎస్ఎస్‌బీఎన్), జి.రాజశేఖర్, బి.సాయికుమార్ (ఎస్కేయూ), ఎం.నవీన్ (ఎస్వీ డిగ్రీ కళాశాల, అనంతపురం), ఎం.అనిల్‌కుమార్ యాదవ్, కె.మహమ్మద్ ఆరీఫ్ (ఆర్ట్స్ కళాశాల, అనంతపురం), ఎస్.విశాల్ (పీవీకేకే), ఎం.రవికుమార్ (ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల), వై.గణేష్ (కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల) ఉన్నారు. ఎంపికైన క్రీడాకారులను ఎస్కేయూ రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ బాబు అభినందించారు.

పాముకాటుతో మహిళ మృతి


సుశీలమ్మ (ఫైల్)

అమరాపురం: మండలంలోని గౌడనకుంట గ్రామానికి చెందిన సిద్దరామప్ప భార్య సుశీలమ్మ (60) పాముకాటుతో మృతి చెందింది. నాలుగు రోజుల క్రితం తమ పొలంలో కలుపు మొక్కలు తొలగిస్తుండగా ఆమెను పాము కాటు వేసింది. దీంతో కాలినడకన ఇంటికి చేరుకున్న ఆమె విషయాన్ని కుటుంబసభ్యులకు తెలపడంతో వారు వెంటనే తుమకూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక నాలుగు రోజుల అనంతరం మంగళవారం ఉదయం ఆమె మృతిచెందింది.

నవోదయలో ప్రవేశాల దరఖాస్తుకు నేడు ఆఖరు

లేపాక్షి: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి అర్హులైన వారు ఈ నెల 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు ప్రిన్సిపాల్ నాగరాజు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు 2025 ఫిబ్రవరి 8వ తేదీ ప్రవేశ పరీక్ష ఉంటుందని, ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయిస్తామన్నారు.

ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తనకల్లు: మండలంలోని గుండువారిపల్లి వద్ద మంగళవారం చోటు చేసుకున్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు... అన్నమయ్య జిల్లా బి.కొత్తకోటకు చెందిన రషీద్, ఖాదర్‌బాషా వ్యక్తిగత పనిపై కొక్కంటికి వచ్చారు. పని ముగించుకున్న అనంతరం ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరిన వారు కొక్కంటి గ్రామ శివారులోకి చేరుకోగానే ఎదురుగా వేగంగా వచ్చిన కారు ఢీకొంది. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా దూసుకెళ్లిపోయాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ స్థానికులు వెంటనే ములకలచెరువులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కూటమి సాయం నిల్...

- సాగుపై రైతుల్లో పెరుగుతున్న అనాసక్తి
- 'అనంత'లో 2022 ఖరీఫ్ కన్నా 1.96 లక్షల హెక్టార్లలో తగ్గిన సాగు విస్తీర్ణం
- శ్రీసత్యసాయి జిల్లాలో 2,90,549 హెక్టార్లు తక్కువగా పంటల సాగు
- బీమా, అన్నదాత సుఖీభవ, సూక్ష్మ సాగు ప్రయోజనాలపై స్పష్టత కరువు



అనంతపురం అగ్రికల్చర్: కూటమి సర్కార్ నుంచి ఎలాంటి సాయం అందకపోవడంతో పంటల సాగుపై రైతులు ఆసక్తి చూపడం లేదు. ఈ–క్రాప్ బుకింగ్ ద్వారా ఖరీఫ్ పంటల సాగు విస్తీర్ణం పరిగణనలోకి తీసుకుంటే ఈ విషయం స్పష్టమవుతోంది. గత వైఎస్ జగన్ సర్కారు క్రమం తప్పకుండా రైతు భరోసా అందిస్తూ రావడంతో ఖరీఫ్, రబీ సాగుపై రైతులు ఆసక్తి చూపించారు. 2022 ఖరీఫ్‌లో వ్యవసాయ, ఉద్యాన పంటలు 12,50,887 హెక్టార్లలో సాగులోకి వచ్చినట్లు ఈ–క్రాప్ బుకింగ్ వివరాలు స్పష్టం చేస్తున్నాయి. అదే ఈ ఖరీఫ్‌లో పంటల సాగు విస్తీర్ణం 10,54,121 హెక్టార్లకు పరిమితమైంది. అంటే 2022 కన్నా ఏకంగా 1,96,765 హెక్టార్ల (4,91,912 ఎకరాలు)లో పంటలు సాగులోకి రాలేదు. ఇక శ్రీసత్యసాయి జిల్లాలో పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. 2022 ఖరీఫ్‌లో 8,03,677 హెక్టార్లలో పంటలు సాగు చేయగా... ఈ ఖరీఫ్‌లో 5,13,127 హెక్టార్లకు పరిమితమైంది. 2022 కన్నా 2,90,549 హెక్టార్ల (7,26,372 ఎకరాలు)లో పంటలు సాగులోకి రాలేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. పశ్చిమ గోదావరి, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాలు మినహా మిగిలిన 23 జిల్లాల్లో 2022 కన్నా తక్కువగానే పంటలు సాగులోకి వచ్చాయి. ఓవరాల్‌గా 2022 ఖరీఫ్‌లో 1,10,13,557 హెక్టార్ల క్రాప్ బుకింగ్ కాగా... ఈ ఖరీఫ్‌లో 13,30,252 హెక్టార్లు తక్కువగా 96,83,304 హెక్టార్లలో పంటలు సాగు చేసినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

సర్కారు సాయంపై పెదవి విప్పని సీఎం

కూటమి సర్కార్ ఏర్పడి ఐదు నెలలు కావస్తున్నా... రైతులకు ఎలాంటి సాయం అందించకుండా దగా చేయడంపై అన్నదాతలు మండిపడుతున్నారు. గతేడాదికి సంబంధించి ఉచిత పంటల బీమా పథకం కింద పెద్ద ఎత్తున పరిహారం అందాల్సి ఉన్నా.. సీఎం చంద్రబాబు పట్టించుకోవడం లేదంటూ వాపోతున్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా 2023 ఖరీఫ్, రబీ పంటలు దారుణంగా దెబ్బతినడంతో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏటా ఉచిత పంటల బీమా కింద జూన్, జూలైలోనే పెద్ద ఎత్తున పరిహారం అందించినట్లు గుర్తు చేసుకుంటున్నారు. బీమా పరిహారం గురించి ఇప్పటి వరకూ కూటమి ప్రభుత్వం ఊసే ఎత్తకపోవడంతో పరిహారం కాస్త పరిహాసంగా మారింది. ఇక ప్రతి రైతుకూ అన్నదాత సుఖీభవ పథకం కింద ఏటా రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తామని ఎన్నికల సమయంలో హామీనిచ్చి రైతుల ఓట్లు కొల్లగొట్టిన చంద్రబాబు... అధికారం చేపట్టిన తర్వాత మిన్నకుండిపోయారు. పెట్టుబడిసాయం ఎప్పుడిస్తారో? ఎంత ఇస్తారో? అనేది స్పష్టత లేకుండా పోయింది. గత జగన్ ప్రభుత్వం ఏటా క్రమం తప్పకుండా జూన్, అక్టోబర్, జనవరిలో పెట్టుబడి సాయం అందిస్తూ వచ్చింది. కరోనా లాంటి కష్టకాలంలోనూ రైతు సంక్షేమాన్ని మరవకుండా అప్పటి సీఎం వైఎస్ జగన్ అందజేస్తూ వచ్చారని రైతులు గుర్తు చేసుకుంటున్నారు. అలాగే డ్రిప్, స్ప్రింక్లర్లు పెద్ద ఎత్తున అందిస్తామని ఎన్నికల సమయంలో గొప్పగా చెప్పినా ఆచరణకు వచ్చే సరికి కూటమి సర్కార్ వైఫల్యం కొట్టొచ్చినట్లు కనబడుతోంది. 37,500 హెక్టార్ల టార్గెట్ నిర్దేశించుకోగా... ఇప్పటి వరకూ 800 హెక్టార్లకు కూడా సూక్ష్మసాగు పరికరాలు ఇవ్వలేదు. ఇలా వ్యవసాయంతో పాటు ఉద్యానశాఖ, ఏపీఎంఐపీ, పశుసంవర్ధక, పట్టుపరిశ్రమశాఖ పరిధిలో ఉన్న రైతులను కూటమి సర్కార్ దారుణంగా వంచించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.